క్లుప్తంగా

తెరచుకున్న శుద్ధజల కేంద్రం



హొళగుందలో తెరచుకున్న సుజల స్రవంతి వాటర్ ప్లాంట్

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: హొళగుంద ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలకు శుద్ధజలం అందిస్తున్న సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ఎట్టకేలకు తెరుచుకుంది. కేవలం విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సరఫరాను నిలిపివేయగా ప్లాంట్ నెల రోజులుగా మూతబడింది. దీనిపై ఈ నెల 20వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'మూతపడిన శుద్ధజల కేంద్రం' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సంబంధిత ప్లాంట్ నిర్వాహకుల సహకారంతో సమస్యను పరిష్కరించి మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

4న అయోధ్య అక్షింతల పంపిణీ

మద్దికెర: అయోధ్య రామాలయం నుంచి పంపిన అక్షింతలను డిసెంబర్ 4వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు సుబ్రమణ్య స్వామి ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్, భజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు భూషణం తెలిపారు. శుక్రవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఉంచారు. స్వామి వారి అక్షింతలను ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన వీరబ్రహ్మేంద్ర దేవాలయంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వీరంపల్లి సంజీవయ్య ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణోత్సవానికి దాతలు పారా విశ్వనాథ్ తాళిబొట్టు, రూ.5 వేలు అలాగే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి రూ.5 వేలు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు వేసి భక్తిని చాటుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కాలజ్ఞానం వినిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పాడి పశువులకు హెల్త్‌కార్డులు

తుగ్గలి: ఆరోగ్య శ్రీ కార్డుల తరహాలో పశువులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులు అమలు చేస్తోందని పశుసంవర్ధక శాఖ ఆదోని డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలి పశు వైద్యశాలలో పశు పోషకులకు యానిమల్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. డీడీ మాట్లాడుతూ.. పశువులు, జీవాలు కలిగిన పశు పోషకులు యానిమల్ ఆరోగ్య కార్డులు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యం, ఆరోగ్య సంరక్షణ చర్యలు, కృత్రిమ గర్భధారణ, పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా ఆ వివరాలను కార్డులో నమోదు చేస్తారన్నారు. ఈ కార్డులపై బ్యాంకు రుణాలు కూడా పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఏడీ రవిప్రకాష్ రెడ్డి, పశు వైద్యాధికారిణి ప్రణీత పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో యువకుడికి, కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన మైనర్ బాలికతో వివాహం జరుగుతుండగా శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు వచ్చి అడ్డుకున్నారు. బాలికకు 18 ఏళ్లు నిండకపోవడంతో వివాహం నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక మేజర్ అయ్యేదాకా కోసిగిలోని కేజీబీవీ హాస్టల్‌లో ఉంచి చదివించనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ఆలూరు రూరల్: మండలంలోని తుంబళబీడు గ్రామంలో పాఠశాలకు గదులను ఆక్రమించుకున్న మాజీ సర్పంచ్ లక్ష్మన్నపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు శుక్రవారం ఎంఈఓ కోమలాదేవి సమక్షంలో జెడ్పీటీసీ శేఖర్, ఎంపీడీఓ అల్లబకాష్‌కు వినతి పత్రం అందించారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు 2009లో సర్పంచ్‌గా ఉన్న లక్ష్మన్న స్థలం కేటాయించగా మూడు అదనపు గదులు నిర్మించారు. ప్రస్తుతం ఆ గదులను ఆక్రమించుకుని సొంత అవసరాలకు వాడుకుంటున్నాడని, బడికి తాళాలు వేస్తే తొలగించి వాదనకు దిగి భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఉపాధ్యాయులు, గ్రామస్తులు చెప్పారు. పాఠశాలలో 151 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, గదుల కొరత కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు మంత్రి రాక

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామ సచివాలయం-2 పరిధిలో శనివారం నిర్వహించే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుంటారన్నారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఎస్‌హెచ్ ఎర్రగుడిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

● **కృష్ణగిరి:** మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ గిరిబాబు, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకట్రాముడు, నాయకులు సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, బస్టాండులో పార్టీ జెండా ను ఎగురవేశారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామ సచివాలయ పరిధిలో రూ.22 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేసినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారని, అలాంటి పగటి వేషగాళ్లకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నాయకులు అనంతరెడ్డి, నారాయణ రెడ్డి, కురువ రామలింగం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



గజ్జహళ్లిలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

● **హొళగుంద:** వెనుకబడిన ప్రాంతమైన గజ్జహళ్లిలో సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.28.12 కోట్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గజ్జహళ్లిలో ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. అలాగే సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. గత ప్రభుత్వాల పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఈశా, మల్లికార్జున, కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.



గురజాలలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● **నందవరం:** మండల పరిధిలోని గురజాల గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి 'సంక్షేమం, అభివృద్ధి' డాష్ బోర్డును ప్రదర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.25.79 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. నాయకులు నరసింహారెడ్డి, రాజారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకే జనం మద్దతు



ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి





అరికెరలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి, బొందిమడుగులలో ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సచివాలయ కన్వీనర్లు

ఎమ్మిగనూరుటౌన్: పేద బడుగు బలహీన వర్గాలకు ప్రస్తుతం మంజూరవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు, 21వ వార్డు సచివాలయల పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికే వర్తించేవన్నారు. ప్రస్తుతం వైఎస్ జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని లబ్ధి పొందిన ప్రతి కుటుంబం కోరుకుంటుందన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ షబ్బీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్లు అంపమ్మ, కేశవరెడ్డి, శివప్రసాద్, సుధాకర్, కోటకొండ నరసింహులు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, వడ్డెరంగన్న, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. శుక్రవారం ఆలూరు మండలంలోని అరికెర గ్రామంలో ఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.28.63 కోట్లు అందించినట్లు వివరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో సంక్షేమ బోర్డు, జెండా ఆవిష్కరించారు. ఎంపీటీసీ షేక్షావలి, సర్పంచ్ నాగరాజు, ఈరన్న, ఉరుకుంద వెంకటేష్ బి.వీరేష్ తదితరులు ఉన్నారు.

తుగ్గలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నిరుపేదల్లో సంతృప్తి స్పష్టంగా కనిపిస్తోందని సచివాలయ కన్వీనర్లు ఈశ్వరరెడ్డి, రంగారెడ్డిలు అన్నారు. శుక్రవారం బొందిమడుగులలో సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను వివరించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈఓపీఆర్డీ తిరుపాల్, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని బనవనూరు గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ పెద్దరెడ్డి ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి సహేరాభాను మాట్లాడుతూ.. బవనూరు సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.15.80 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలయ్యశెట్టి, హసన్, రంగన్న, ఈరన్న పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామంలో సర్పంచ్ మల్లమ్మ పార్టీ శ్రేణులతో కలిసి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను గ్రామ ప్రజలకు వివరించారు. ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, నాగేంద్ర, భీమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి సచివాలయంలో జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. గ్రామంలో రూ.16.87 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్టీ నాయకులు వెంకటేశులు, భద్రయ్య, సంజప్ప, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జెడ్పీటీసీ రామకృష్ణ ఆధ్వర్యంలో 'ఏపీకి సీఎం జగన్ మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ మల్లయ్య, రాజారెడ్డి, ఉముంబా, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని బేవినహాల్ గ్రామంలో సర్పంచ్ బసవరాజ్, జెడ్పీటీసీ లింగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్', పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జగనన్న పాలన స్వర్ణయుగంలా కొనసాగుతోందన్నారు. బేవినహాల్ గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.13,72,12,096 అందించినట్లు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ నగేష్, పరశురాం, శ్రీనివాసులు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని అలువాల గ్రామ సచివాలయంలో వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రమోద్‌కుమార్ రెడ్డి సంక్షేమ పథకాల బోర్డును అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.15.20 కోట్లను అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమచేసినట్లు వివరించారు. ఈఓఆర్డీ నాగేష్, మనోహర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



చక్రాళ్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్

● **పత్తికొండ రూరల్:** మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో సర్పంచ్ పూరి శ్రీరాములు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఎంపీపీ నారాయణదాస్ ఆవిష్కరించారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు నాగరాజు, సోమశేఖర్, టీఎండీ హుసేన్, కేశవరెడ్డి, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అలారుదిన్నెలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బనవనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ పెద్దరెడ్డి



నగరదోణలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మల్లమ్మ



బసినేపల్లిలో పార్టీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అలువాలలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేవినహాల్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మౌలిక సదుపాయాలు కల్పించండి

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ గౌరీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో కనీసం తాగునీరు లేదని, ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ.. కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, మండల కార్యదర్శి భాస్కర్, సురేంద్ర, దస్తగిరి, నరేష్ ఉన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో ఉపాధి పనులు కల్పించేందుకు రైతులకు కావాల్సి న పనులు గుర్తించాలని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బంది సమావేశం నిర్వహిచారు. ఆయన మాట్లాడు తూ.. గ్రామాలలోని పొలాలలో పంటలకు ఉప యోగపడే పనులు గుర్తించి రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, జాబ్‌కార్డు జిరాక్స్‌లు ఉపా ధి కార్యాలయంలో అందజేయా లని సూచించారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రాజు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: సమిష్టితో కృషితో స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రిన్సిపాల్ మహబుబ్‌బాష, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ పేర్కొన్నారు. కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో శుక్రవారం కళాశాలలో అకడమిక్ ఆడిట్ కార్యక్ర మం వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులైన అడ్వయిజర్లు ఉస్మాన్‌అహమ్మద్, కిరణ్‌కుమార్‌లు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల లో అన్ని డిపార్ట్‌మెంట్లను వారు సందర్శించి అకడమిక్ రికార్డులను ఆడిట్ చేసి అధ్యాపకులకు తగిన సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల త్వరలో న్యాక్ పరిశీలనకు వెళుతున్నందున మంచి గ్రేడ్ పొందేలా కృషి చేయా లని సూచించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

అవి-ఇవి

కడమకుంట్లలో డెంగీ కేసు నమోదు

తుగ్గలి: మండల పరిధిలోని కడమకుంట్లలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు నాలుగు రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు మొదట అనంతపురం తీసుకెళ్లారు. తిరిగి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో డెంగీ పాజిటివ్‌గా తేలింది. దీంతో శుక్రవారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కడమకుంట్లలో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగిందని హిందుపురం ఎంపీ గోరంట్లమాధవ్ స్పష్టం చేశారు. హాలహర్వి మండలం విరుపాపురం గ్రామంలో శుక్రవారం ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనలో పేదలకు ఎంతో మేలు జరిగిందని వివరించారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. ప్రభుత్వం స్థానిక నాయకులతో చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం, మంత్రులతో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చిన స్పందన చూసి ప్రతిపక్ష టీడీపీ నేతలకు గుబులు పుట్టిందన్నారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని పొలంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు పాదలకుంట గాదిలింగ, గాదిగౌడ్‌తో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.65,510 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. అలాగే మూడు బైక్‌లను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

భజన పోటీల విజేత లక్ష్మిపల్లి

ఆస్పరి: మండలంలోని అట్టికల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత (అంగయ్యస్) 13వ ఆరాధనోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం లక్ష్మిపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టుకు మొదటి బహుమతిగా రూ.12,600 ను శుక్రవారం ఆలయ నిర్వాహకులు, దాతలు అందజేశారు. అలాగే రెండవ బహుమతి గుత్తి ఆర్‌ఎస్ జట్టుకు రూ. 9,999, తర్వాతి స్థానాల్లో నిలిచిన ఆలంకొండ జట్టుకు రూ.8,100, దొడగొండ జట్టు కు రూ.7,200 తురువగల్లు జట్టుకు రూ.6,300, హలిగేర బృందానికి రూ.5,400, ఐనకల్లు జట్టుకు రూ.4,500, ముత్తుకూరు జట్టుకు రూ.3,600, బనవనూరు జట్టుకు రూ.2,700, పదో బహుమతి యనకండ్ల బృందానికి రూ.1,800 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉత్తమ హార్మోనిష్టుగా లక్ష్మిపల్లి సుదర్శన్ ఆచారి, ఉత్తమ తబలిస్టుగా గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన వెంకటేష్, ఉత్తమ గాయకుడిగా అలంకొండ చిదంబరరెడ్డి ఎంపికయ్యారు. వీరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సమన్వయంతోనే అభివృద్ధి, సౌకర్యాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి, ప్రజలకు సౌకర్యాల కల్పన సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ-2 చెరుకులపాడు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్ నిర్వహణలో అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పథకాల అమలు తీరును, చేసిన, జరుగుతున్న పనులను వివరించారు. జెడ్పీటీసీ సుంకన్న, మల్లెపల్లె సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి పలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. సమస్యల ప్రస్తావనతో సమావేశం వాడీవేడిగా సాగింది. స్థానిక సీహెచ్‌సీలో సిబ్బంది మందులను బయటి మెడికల్ స్టోర్‌లకు రాస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అరికట్టాలని జెడ్పీటీసీ కోరారు. రైతుల పొలాల్లో బోరు వేసేందుకు, విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు వాల్టా యాక్టు నిబంధనలను సడలించాలని మల్లెపల్లె సర్పంచ్ కోరారు. విద్యుత్ దీపాల నిర్వహణకు సహకరించాలని గోవర్ధనగిరి సర్పంచ్ ఎల్లరాముడు కోరారు. హౌసింగ్ ఏఈ, మరికొందరు అధికారుల గైర్హాజరుపై ఆగ్రహించారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు ఇస్తే నాడు నేడు కింద భవనాలు నిర్మిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత పేర్కొన్నారు. డీటీ ప్రసాద్‌రాజు, ఈఓఆర్డీ నరసింహులు, వైస్ ఎంపీపీ-1 రంగడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేంద్ర శుక్రవారం తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో నంద్యాల జిల్లా మిడుతూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న హరికృష్ణ, 8వ తరగతి చదువుతున్న రూప ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు జనవరిలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. క్రీడాకారులను హెచ్‌ఎం నిస్సార్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మద్దికెర: ప్రభుత్వ నిబంధనల మేరకు భవనాల నిర్మాణం చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఈరన్న సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దికెరలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. క్వాలిటీ ఉన్న వాటికే బిల్లు మంజూరు చేస్తామన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆలూరు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మంజునాథ్‌రెడ్డి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి



సమస్యలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ-2 నాగవేణి

ఆలూరు రూరల్: మండలంలో అభివృద్ధి పనులు కుంటుపడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అల్లబకాష్ సమక్షంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని తుంబళబీడు గ్రామంలో 2009 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల అదనపు గదులకు స్థలం ఇచ్చిన ఆ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మన్న ఇటీవలే గదులను ఆక్రమించుకున్నాడని ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆలూరులోని ప్రభుత్వ మోడల్ హైస్కూల్‌లో హిందూ, సోషల్ మీడియం టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆ పోస్టులను భర్తీ చేయాలని వైస్ ఎంపీపీ-2 నాగవేణి అధికారులను కోరారు. అలాగే ప్రజా ప్రతినిధులు, సర్పంచుల ప్రమేయం లేకుండా గ్రామీణులు ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్నారని కురుకుంద సర్పంచ్ దేవి రెడ్డి అధికారులకు చెప్పారు. సమావేశంలో ప్రధానంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ, తాగునీటి, డ్రైనేజీ, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సేవలపై చర్చించారు. సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ అధికారులను ఆదేశించారు. సమావేశానికి కో-ఆప్షన్ మెంబర్ బాషా, డీటీ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

కోలుకోలేక విద్యార్థిని మృతి

తుగ్గలి: కడపునొప్పి తాళలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన విద్యార్థిని కోలుకోలేక మృతి చెందింది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాతనకు చెందిన బీమరాజు మూడవ కూతురు శ్రావణి (20) పత్తికొండ ప్రతిభ కాలేజీలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లుగా శ్రావణి కడుపు నొప్పితో బాధపడుతుండేది. నొప్పి తీవ్రం కావడంతో విరక్తి చెంది ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నేడు మండల సమావేశం

నందవరం: మండల సర్వసభ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన చేపట్టనున్న సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అలాగే ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.